# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రైతుల ఆర్ధికాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్ తెలిపారు.
- స్వాతంత్ర్య సమరయోధులు సర్ధార్ గౌతు లచ్చన్న భావితరాలకు స్ఫూర్తి అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.
- క్రికెట్ అభివృద్ధి, మౌలికవసతుల కల్పనకు కృషి చేస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కేశినేని శివనాథ్ తెలియజేశారు.
- రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.
- అల్పపీడనం ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణం కేంద్రం వెల్లడించింది.

==============================

రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో ఈరోజు నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. జన్మాష్టమి సందర్భంగా తిరుపతిలోని ఇస్కాన్ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు తిరుపతిలోని ఇస్కాన్ ఆలయానికి చేరుకుంటున్నారు. ఇక విజయవాడలోని ఇస్కాన్ మందిరంలో గోకులకృష్ణుడిని దర్శించుకునేందుకు వచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్థానిక పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు గోమాతలను అలంకరించి గోకులం నుంచి ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభా మందిరానికి ఊరేగింపు నిర్వహించారు.

==============================

శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.10 అడుగులకు చేరింది. దీంతో శ్రీశైలం జలాశయం మరో గేటును ఈరోజు ఎత్తారు. ప్రస్తుతం 5 గేట్ల ద్వారా నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.

==============================

నమ్మిన సిద్ధాంతాలకు చివరి వరకూ కట్టుబడిన వ్యక్తి అటల్ బిహారీ వాజ్ పేయి అని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ కొనియాడారు. భారతరత్న, పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా ఈరోజు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని నివాసంలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక, మౌలిక సంస్కరణలతో వాజ్‌పేయి దేశ రూపురేఖలు మార్చారని పేర్కొన్నారు. ఆయన దూరదృష్టి కారణంగా దేశం వికసిత్ భారత్ దిశగా అడుగులు వేసేందుకు పటిష్టమైన పునాది ఏర్పడిందని వివరించారు.

స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా మంత్రి నారా లోకేష్ నివాళులు అర్పించారు. రాజకీయాలకు అతీతంగా పేదల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి గౌతు లచ్చన్న అని అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని మంత్రి లోకేష్ తెలిపారు.

==============================

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. తాడేపల్లిలో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఏసీఏ అధ్యక్షుడిగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, కార్యదర్శిగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... రాబోయే మూడేళ్లలో ఏసీఏ ద్వారా క్రికెట్ అభివృద్ధికి, స్టేడియంలలో మౌలికవసతుల కల్పనకు కృషి చేస్తామని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

కూటమి ప్రభుత్వంలో రైతే రాజని రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖా మంత్రి ఎన్.ఎం.డి.ఫరూఖ్ పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని మార్కెట్ యార్డ్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు రైతులతో కలిసి మంత్రి ఈ రోజు ట్రాక్టర్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు మొదటి విడతగా 7 వేల రూపాయలు అందించామన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధతో కృషి చేస్తోందని తెలిపారు.

విరామం

==============================

స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న భావితరాలకు స్ఫూర్తి అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఆయన దిక్సూచి లాంటివారని తెలిపారు. గౌతు లచ్చన్న 116వ జయంతి కార్యక్రమాన్ని విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు నిర్వహించారు. గౌతు లచ్చన్న చిత్రపటానికి మంత్రితో పాటు, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేటి తరానికి సర్దార్ గౌతు లచ్చన్న వంటి వారి జీవిత చరిత్రలు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడి అందరికీ మార్గదర్శకులుగా నిలిచారని చెప్పారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఈరోజు ఆయన విగ్రహానికి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సర్దార్ గౌతు లచ్చన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద గల ఆయన విగ్రహానికి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బలహీన వర్గాలు, రైతు, కార్మిక నాయకుడిగా అనేక ఉద్యమాలను సాగించిన సర్దార్ గౌతు లచ్చన్న మార్గం అందరికీ అనుసరణీయం అని తెలిపారు.

==============================

కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానాన్ని అనుసరించి నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే పాఠశాలలో చదివేలా వసతుల ఏర్పాటుకు చర్యలు చేపడతామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని పలు ఉన్నత పాఠశాలలను ఆయన ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపల్ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి నగరంలోని 15 పాఠశాలలను అన్ని హంగులతో పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు. పీ4 విధానంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను అభివృద్ధి చేస్తామని వివరించారు. ఆధునిక వసతులతో పాటూ డిజిటల్ విద్యాబోధనకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామని మంత్రి నారాయణ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు 29 తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

==============================

దక్షిణ ఒడిశా, ఉత్తర ఆంధ్రప్రదేశ్ పై అల్పపీడనం ప్రభావం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. ఇదే సమయంలో అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి, నైరుతి దిశగా కదులుతోందని వాతావరణం కేంద్రం అధికారిణి జి.లక్ష్మి తెలిపారు. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

==============================
==============================